## నిడుమోలు లో వాహనాల తనిఖీ - ఎస్సై సురేష్ కఠిన చర్యలు

మచిలీపట్నం (పెన్ పవర్) ఫిబ్రవరి 17:
వాహనాలను తనిఖీ చేస్తున్న కూచిపూడి ఎస్సై సురేష్
కూచిపూడి ఎస్సై సురేష్ మంగళవారం సాయంత్రం కూచిపూడి ప్రధాన సెంటర్లో వాహనాలను ఆకస్మిక తనిఖీ నిర్వహించారు.రాకపోకలు కొనసాగిస్తున్న వాహనాలను తనిఖీ చేయడంతో పాటు సంబంధించిన రికార్డులను పరిశీలించి ఆయా వాహనాలపై చలానా బకాయిలు ఉన్నది లేనిది పరిశీలిస్తున్నారు. వాహనాలపై గతంలో ఫైన్ ఇదించి ఉంటే పోలీసులు విధించిన ఫైన్ చెల్లించినది లేనిది పరిశీలించి తిరిగి వారి నుండి పైన కట్టిస్తున్నారు. అంతేకాకుండా వాహనదారులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తూ అతివేగం ప్రమాదమని నిబంధనల మేరకు వాహనాలు నడపాలని సూచిస్తున్నారు



పెన్ పవర్
సెంట్రల్ ఆంధ్ర
కృష్ణా జిల్లా । ఎన్.టి.ఆర్. జిల్లా । గుంటూరు జిల్లా । పల్నాడు జిల్లా । బాపట్ల జిల్లా

## నిరుపేద విద్యార్థులకు ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత విద్య- ఎంఈఓ-2 రవికుమార్

పెన్ పవర్ కారంపూడి వెంకటేష్ పెనుగొండ్ల ఫిబ్రవరి18:కారంపూడి మండలములోని ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల్లో పైసా ఖర్చు లేకుండా ఉచిత విద్యఅభ్యసించే అవకాశాన్ని నిరుపేద విద్యార్థుల కు ప్రభుత్వం కల్పిస్తోందని మండల విద్యాశాఖ అధికారి-2 రవి కుమార్ అన్నారు. బుధవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడు తూ విద్యాహక్కు చట్టం 2009 అనుసరించి ప్రైవేటు విద్యాసంస్థల్లో ఒకటవ తరగతిలో 25 శాతం సీట్లు పేదలకు కేటాయిస్తున్నారని తెలిపారు. 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాల నోటిఫికేషన్ విడుదలైందని, లాటరీ ద్వారా విద్యార్థులను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. అనాథలు, హెచ్ఐవి బాధిత చిన్నారులకు ,ఎస్సీలకు, ఎస్టీలకు , బిసి మైనారిటీ ఇతరులకు సీట్లు కేటాయిస్తారని, సీబీఎస్ఈ ప్రవేశాలకు 2020జూన్ 2 నుంచి 2021 మార్చి 31వ తేదీ లోపు జన్మించి ఉండాలని, స్టేట్ సిలబస్ పాఠశాలల్లో ప్రవేశాలకు 2020 జూన్ 2 నుంచి 2021మే 31వ తేదీ మధ్య జన్మించిన వారు అర్హులని తెలిపారు. చిరునామా ధృవీకరణకు ఆధార్, ఓటర్ ఐడి, రేషన్ కార్డు, ఉపాధి హామీ జాబు కార్డు, డ్రైవింగ్ లైసెన్సుల్లో ఏదో ఒకటి సమర్పించవచ్చన్నారు. వయస్సు ధ్రువీకరణఎకు జనన ధ్రువీకరణ పత్రం తప్పనిసరి, గ్రామ వార్డు సచివాలయాలు విద్యా వనరుల కేంద్రాలు పాఠశాలల నుంచి ఆన్లైన్లో దరఖాస్తు చేయవచ్చన్నారు. ఆన్లైన్ పోర్టల్లో ప్రైవేటు పాఠశాలల నమోదు ప్రక్రియను మార్చి 10 వ తేదీ లోపు పూర్తిచేయనున్నారు.
ఈ నెల 20 నుంచి మార్చి 10వ తేదీ వరకు విద్యార్థుల నమోదు ప్రక్రియ చేపడుతారు. అర్హత నిర్ధారణ మార్చి 17న జరుగుతుంది. మొదటి విడత లాటరీ మార్చి 25 రెండో విడత లాటరీ ఏప్రిల్ 12న నిర్వహిస్తారు. ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశానికి అర్హులు దరఖాస్తు చేసుకోవాలని రవి కుమార్ కోరారు



## కోటప్పకొండ తిరునాళ్ల హుండీ ఆదాయం లెక్కింపు




నరసరావుపేట పెన్ పవర్ ప్రతినిధి ఫిబ్రవరి 18: పల్నాడు జిల్లా కోటప్పకొండలో నిర్వహించిన వార్షిక తిరునాళ్ల సందర్భంగా భక్తులు సమర్పించిన హుండీ ఆదాయాన్ని పలువురు అధికారుల సమక్షంలో బుధవారం లెక్కించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఆదాయం వివరాలు తెలిపారు. అయన తెలిపిన వివరాల ప్రకారం, దర్శన టికెట్లు, అన్నదానం విరాళాలు, ప్రసాదాల అమ్మకాలు మరియు హుండీ ద్వారా మొత్తం రూ.1,95,81,848 (ఒక కోటి తొంభై ఐదు లక్షల ఎనభై ఒక వేల ఎనిమిది వందల నలభై ఎనిమిది రూపాయలు) ఆదాయం లభించిందన్నారు. అదేవిధంగా భక్తులు సమర్పించిన నజరానాల్లో బంగారం: 3 గ్రాములు 055 మిల్లీగ్రాములు, వెండి: 278 గ్రాములు 300 మిల్లీగ్రాములు, యూఎస్ డాలర్లు: 13 లభించినట్లు అయన వెల్లడించారు.హుండీ లెక్కింపులు పారదర్శకంగా నిర్వహించబడినట్లు అధికారులు తెలిపారు. తిరునాళ్ల సందర్భంగా పెద్ద ఎత్తున విచ్చేసిన భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు దేవస్థానం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు వారు పేర్కొన్నారు

## కళాశాల కేటాయింపుపై నిరసనతో నిలిచిపోయిన రాకపోకలు

నరసరావుపేట పెన్ పవర్ ప్రతినిధి ఫిబ్రవరి 18: పల్నాడు జిల్లా నరసరావుపేట పట్టణంలోని సత్తెనపల్లి రోడ్ మార్గంలో ఉన్న మైనారిటీ కళాశాల వద్ద బుధవారం నాడు ముస్లిం సంఘాలు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టాయి. మైనారిటీ కళాశాల భవనాన్ని (కేంద్రీయ విద్యాలయ సంగతం) ఆధ్వర్యంలోని విద్యాసంస్థకు కేటాయించాలన్న అధికారుల నిర్ణయానికి వ్యతిరేకంగా ఈ నిరసన నిర్వహించినట్లు సంఘ ప్రతినిధులు తెలిపారు. మైనారిటీ ఆస్తులను పరిరక్షించాలని, కళాశాల హక్కులను కాపాడాలని వారు డిమాండ్ చేస్తూ పెద్ద సంఖ్యలో సభ్యులు రహదారిపై కూర్చొని ఆందోళన కొనసాగించారు. దీంతో సత్తెనపల్లినరసరావుపేట ప్రధాన మార్గంలో వాహన రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. భారీగా వాహనాలు ఆగిపోవడంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. శాంతి భద్రతల పరిరక్షణకు అవసరమైన చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. సంఘ నాయకులతో చర్చలు జరిపి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని సంబంధిత అధికారులు వెల్లడించతంతో ఆందోళనను విరమించారు.






## ఉపాధి పనులపై ప్రజా వేదిక

### జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి 125 రోజులు పని కల్పించాలి

### ప్రాజెక్ట్ డైరెక్టర్ సిద్దాలింగమూర్తి

పెన్ పవర్ కారంపూడి వెంకటేష్ పెనుగొండ్ల ఫిబ్రవరి 18:---
మండలంలో 2024 ఏప్రిల్ నుండి 2025 మార్చి వరకు జరిగిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులపై బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వద్ద సామాజిక తనిఖీ ప్రజావేదిక జరిగింది. 8 కోట్ల 63 లక్షల 94 వేల రూపాయలతో జరిగిన పనులలో మెటీరియల్ కు రెండు కోట్ల 24 లక్షల రూపాయలు కూలీల వేతనాలకు ఆరుకోట్ల 39 లక్షల రూపాయలు చెల్లించారు. పంట కాలువలు, పశువుల షెడ్లు,హార్ట్ కల్చరల్,హౌసింగ్,సీసీ రోడ్లు, ప్రహరీ గోడలు, నిర్మాణానికి నిధులు కేటాయించారు. గత పది రోజుల నుండి సామాజిక తనిఖీ బృందం గ్రామాలలో పనులను పరిశీలించి కూలీల విచారించారు. గ్రామసభలు నిర్వహించి సమస్యలను తెలపాలని కోరారు. మండలంలోని గ్రామాలలో సామాజిక తనిఖీ బృందం నివేదికను ప్రజా వేదికల్లో వెల్లడించారు. ఫీల్డ్ అసిస్టెంట్ల నుండి 89 వేల ఎనిమిది వందల యాభై తొమ్మిది రూపాయలు రికవరీ చెల్లించాలని అధికారులు ఆదేశించారు. ప్రజావేదికలో ప్రాజెక్టు డైరెక్టర్ సిద్ధ లింగమూర్తి, ఏపీ డీవో జీవీ సత్యనారాయణ, విజిలెన్స్ ఆఫీసర్ హీరోలాల్ నాయక్, ఏ వి ఓ విజయలక్ష్మి, జె క్యూ సి ప్రభాకర్,ఎస్ ఆర్ పి తులసీ నాయక్,ఏపీఓ కోటిరెడ్డి, నాగేశ్వరరావు, ఉపాధి హామీ సిబ్బంది ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.అనంతరం ప్రాజెక్ట్ డైరెక్టర్ సిద్ధ లింగమూర్తి మాట్లాడుతూ గ్రామాలలో ఉపాధి హామీ కూలీలకు 125 రోజులపాటు పని కల్పించాలని ఆయన తెలిపారు ఇప్పటికే గ్రామాలలో గ్రామ సభలు నిర్వహించి పనులు గుర్తించినట్లు తెలిపారు వేసవిలో వ్యవసాయ కూలీలకు పనులు కల్పించే విధంగా ఫీల్డ్ అసిస్టెంట్లు చొరవ చూపాలని అన్నారు.

## ఇంటి పన్ను బకాయిలు తక్షణమే చెల్లించాలి

### దీర్ఘకాలిక బకాయిలు ఉన్న యజమానులకు రిజిస్టర్ పోస్టు ద్వారా స్పెషల్ నోటీసులు జారీ

### పంచాయితీ ఈవో కసిన్యా నాయక్



పెన్ పవర్ కారంపూడి వెంకటేష్ పెనుగొండ్ల ఫిబ్రవరి18:
కారంపూడి పట్టణంలో ఇంటి పన్ను బకాయాలను తక్షణమే చెల్లించి గ్రామపంచాయతీ అధికారులకు సహకరించాలని పంచాయతీ ఈవో కె. కసిన్యా నాయక్ అన్నారు.బుధవారం స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆదేశాల మేరకు ఇంటి పన్ను బకాయిలను వేగవంతం చేస్తున్నట్లు తెలిపారు. దీర్ఘకాలికంగా ఉన్న ఇంటి పన్ను బకాయిలకు ప్రత్యేక నోటీసులు జారీ చేస్తామని తెలిపారు ఇంటి యజమానులు రెండు మూడు రోజుల్లో గ్రామపంచాయతీ సిబ్బందికి బకాయిలు చెల్లించాలని అన్నారు లేదంటే రిజిస్టర్ పోస్టు ద్వారా నోటీసులు జారీ చేయిస్తున్నట్లు ఆయన తెలిపారు

## ప్రారంభమైన రంజాన్ తరావి ప్రార్థనలు

**-అంజుమన్ కమిటీ అధ్యక్షులు అబ్దుల్ రహీమ్ జానీ -నేటి నుండి రంజాన్ ఉపవాసాలు ప్రారంభం**

పెన్ పవర్ బ్యూరో బాపట్ల ఫిబ్రవరి 18:
పవిత్ర రంజాన్ నెల దీక్షలు ఈనెల 19 వ తేదీ నుండి ప్రారంభమవుతాయని అంజుమన్ కమిటీ అధ్యక్షులు అబ్దుల్ రహీమ్ జానీ తెలిపారు . స్థానిక అంజుమన్ మసీద్ ప్రాంగణంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ముస్లింలకు అతి పవిత్ర మాసమైన రంజాన్ దీక్షలు నేటి నుండి ప్రారంభమవుతాయన్నారు. పట్టణంలోని 17 మసీదులో రంజాన్ మాసానికి సంబంధించిన అన్ని సదుపాయాలు ఏర్పాట్లు పూర్తయ్యాయని అన్నారు . ప్రతి ఒక్క ముస్లిం విధిగా ఈ దీక్షలో పాల్గొని దేవుని ఆశీస్సులు దీవెనలు పొందాలని ఆయన ఆకాంక్షించారు. జకాత్ ఇవ్వగలిగే స్తోమత ఉన్న ముస్లిం సోదరులు కూడా విధిగా చెల్లించాలని ఆయన తెలిపారు. అదేవిధంగా జమేదార్ పేట ,ఇస్లాంపేట బరియల్ గ్రౌండ్లో రంజాన్ కు సంబంధించిన ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సెక్రటరీ అబ్దుల్ కరీం వైస్ ప్రెసిడెంట్ బాజీవలి సభ్యులు అబ్దుల్ మజీద్ మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



## పంట నమోదు చేసుకుంటేనే సంక్షేమ పథకాలు.

### ఎడ్లపాడులో జిల్లా వ్యవసాయ అధికారి పరిశీలన.



చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, ఫిబ్రవరి 18 :
ఎడ్లపాడు : సాగు చేసిన ప్రతి పంటను వ్యవసాయ శాఖ పంట యాప్లో నమోదు చేసుకుంటే వ్యవసాయ సంక్షేమ పథకాలన్నీ పొందవచ్చని జిల్లా వ్యవసాయ అధికారిఎం జగ్గారావు తెలిపారు.ఎడ్లపాడు మండలం తుర్లపాడు గ్రామంలో పంట నమోదు చేసుకున్న పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి,రికార్డులు తనిఖీ చేసి, సూపర్ చెక్ను నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, 2025-26లో మండల రైతు సేవా కేంద్రాల సిబ్బంది నమోదు చేసిన పంటలను జియో ఫెన్సింగ్తో తనిఖీ చేశామని తెలిపారు. మండలంలో రబీ సీజన్లో 1220 హెక్టార్లలో సెనగ, 447 హెక్టార్లలో మొక్కజొన్నతో పాటు వరి, పొగాకు, కంది, మినుము, పెసర, వరిగ, జొన్న, నువ్వులు తదితర పంటల సాగు నమోదు జరిగిందని, ఇవన్నీ జియో ఫెన్సింగ్ విధానంలోనే నమోదు చేయబడ్డాయని ఆయన వివరించారు.అంతేకాకుండా,మండలంలోని అందరు రైతులు విధిగా 11 అంకెల విశిష్ట సంఖ్య కలిగి ఉండాలని సూచించారు.ఈ సంఖ్య కలిగినవారికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలువర్తిస్తాయి. ఇంకా లేనివారు సమీప రైతు సేవా కేంద్రంలో నమోదు చేసుకుని పొందుకోవచ్చని కోరారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఏ.హరిప్రసాద్, గ్రామ వ్యవసాయ స్నేహితులు విజయలక్ష్మి, గ్రామ రైతులు పాల్గొన్నారు

## అతివేగానికి యువకుడు మృతి

### - బాలికకు గాయాలు

పెన్ పవర్ కారంపూడి వెంకటేష్ పెనుగొండ్ల ఫిబ్రవరి 18:-----
అతివేగం ప్రమాదకరమని అధికారులు హెచ్చరిస్తున్న యువత మాత్రం తమ పందాన్ని మార్చుకోవటం లేదు బుధవారం అతివేగంగా వస్తున్న యువకుడు బాలికను ఢీకొని సమీపంలోని విద్యుత్ స్తంభానికి తగిలి మృతి చెందిన సంఘటన బుధవారం మండల కేంద్రమైన కారంపూడి లోని ఆదినారాయణ కాలనీలో చోటుచేసుకుంది బొల్లాపల్లి మండలం గుమ్మనంపాడు గ్రామానికి చెందిన మన్సూర్ (24) ద్విచక్ర వాహనంపై అతివేగంగా కారంపూడి వస్తుండగా ఆదినారాయణ కాలనీ సమీపంలో రోడ్డు దాటుతుండగా శిరీష అనే బాలికను ఢీకొని సమీపంలోని విద్యుత్ స్తంభానికి తగలటంతో తలకు బలమైన గాయాలు తగిలాయి దీనితో మున్సూర్ అక్కడికక్కడే మృతి చెందాడు శిరీష అనే బాలికను మెరుగైన వైద్యం కోసం పిడుగురాళ్ల వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు







# కోటప్పకొండ తిరునాళ్ల నిర్వహణలో అధికార యంత్రాంగం పూర్తిగా వైఫల్యం

**కోటప్పకొండ లో తిరునాళ్లలో మద్యం అమ్మకాలు, చిరు వ్యాపారుల దగ్గర మాముళ్ల అక్రమ దందా కూటమి ప్రభుత్వ పనితీరుకు నిదర్శనం**

**రొంపిచర్ల మండలం వి ప్పర్లలో క్యాసినో ఏర్పాట్లతో గ్రామాల్లో కలుషిత వాతావరణం-క్యాసినో ఏర్పాటుతో కోట్ల రూపాయల అక్రమార్జనకు పాల్పడిన కూటమి నాయకులు**

**సంపాదనే ధ్యేయంగా కోటప్పకొండ తిరునాళ్లు నిర్వహించిన అరవింద్ బాబు**

**వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన గోనెపూడి ప్రభ వద్ద లాఠీ చార్జికి రూరల్ ఎస్పై పూర్తి బాధ్యత వహించాలి-భవిష్యత్తులో రూరల్ ఎస్పై పై చర్యలు తప్పవు**

**ప్రకాశం జిల్లా కు చెందిన యువకుడి దుర్మరణం కోటప్ప కొండ తిరుణాలకు మాయనిమచ్చ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పల్నాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి**

నరసరావుపేట పెన్ పవర్ ప్రతినిధి ఫిబ్రవరి 18: పల్నాడు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ చేసిన కామెంట్స్.

గత 40 - 50 సంవత్సరాల లో కోటప్పకొండ తిరుణాల లో ఈ సంవత్సరం జరిగినంత ఘోర వైఫల్యం ఎప్పుడు జరగలేదు అన్నారు. కొత్త కొత్త ప్రయోగాలు చేస్తూ అధికారులు సమన్వయం లోపంతో ఎవరి సలహాలు సూచనలు తీసుకోకపోవడంతో, భక్తులు అనేక రకాలుగా ఇబ్బందులు పడ్డారన్నారు. మొట్టమొదటి తప్పిదం బస్టాండ్ ఒక కిలోమీటర్ అవతల ఏర్పాటు చేయడం అన్నారు. పెద్ద వయసు ఉన్న వృద్ధులు, మహిళలు, పిల్లలు కిలోమీటర్ దాకా నడిచి వెళ్లి బస్సులు ఎక్కాల్సిన దుస్థితి వచ్చిందన్నారు. బస్సు దిగిన వద్ద నుంచి కొండపైకి బస్సులు ఎందుకు నడపలేదు అనేది ఆశ్చర్యకరమైన విషయం అనిచెప్పారు. తిరునాళ్ల సందర్భంగా లక్ష 25 వేల మంది కోటప్పకొండకు వస్తే 80 వేల మంది ఈ బస్సు స్టాండ్ ను ఉపయోగిస్తారు, అయితే ఈ 80 వేల మంది అనేక రకాలుగా ఇబ్బందులు ఎదుర్కోవటం జరిగిందన్నారు.

బస్సులు ఎక్కడానికి కిలోమీటర్ నడవాల్సిన పరిస్థితి ఈ కిలోమీటర్ పొడుగునా ఎక్కడ తాగడానికి మంచి నీళ్లు కూడా లేకపోవడంతో భక్తులు అనేక రకాలుగా ఇబ్బందులు పడ్డారన్నారు. మెట్ల మార్గం మీద వెళ్లే భక్తులకు ఎటువంటి వసతి కల్పించకపోవడం వల్ల మెట్ల మార్గంలో ఏర్పడిన రద్దీ వల్ల చివరికి ఒక చిన్న పాప ఊపిరాడని పరిస్థితికి వెళ్లడం బాధాకరమైన విషయం అని తెలియజేసారు. కనీసం మంచినీళ్లు కూడా భక్తులకు మెట్ల మార్గంలో ఏర్పాటు చేయకపోవడం దారుణమైన విషయం అని చెప్పారు. ట్రాఫిక్ జామ్ తో ఎప్పుడైతే ఘాట్ రోడ్ బ్లాక్ అయిపోయిందో, మెట్ల మార్గం గుండా వెళ్ళమని అధికారులు ఇచ్చిన సలహాతో మెట్ల మార్గంలో తీవ్రమైన రద్దీ ఏర్పడి భక్తులు తీవ్ర ఒత్తిడికి లోనయ్యారన్నారు.

ఎన్నో సంవత్సరం నుంచి కోటప్పకొండకు తరలి వస్తున్న భక్తులు ఇంత దారుణమైన పరిస్థితులు ఎప్పుడూ చూడలేదని భక్తులు చెప్పుకుంటున్నారు అని చెప్పారు. గత 50 -60 సంవత్సరాల కాలంలో రంగులరాట్నం లేకుండా, స్టాల్స్ అన్నీ లేకుండా తిరణాల్ల జరగడం ఇదే మొదటిసారి అన్నారు. ప్రైవేట్ స్థలంలో ఎమ్మెల్యే కి, ఎమ్మెల్యే అనుచరులకు ఏం పని ఆ స్థల యజమానుల స్థలాలు లీజు కి ఇచ్చుకుంటూ ఉంటారు, వాళ్లకు అదే ఆదాయ మార్గం అక్కడ సంవత్సరం పొడుగునా పంటలు పండవు కాబట్టి కౌలు మేర డబ్బులు తిరుణాల సందర్భంగా వాళ్లకు వస్తాయి వాటికి కూడా గండి కొట్టే పని ఎమ్మెల్యే చేయడం దారుణం అన్నారు. అక్కడికి వెళ్లి డబ్బులు ఎందుకు కలెక్ట్ చేయాలి, వారికి ఏమి సంబంధం అని సూటిగా ప్రశ్నించారు. ఆఖరికి తిరుణాళ్లలో చిన్నచిన్న బండ్లు పెట్టుకొని చిన్న చిన్న చిరు వ్యాపారాలు చేసుకునే వ్యాపారస్తులు వద్ద కూడా రూ.1000 నుంచి 2000 రూపాయలు వసూలు చేశారు ఇది చాలా దారుణమైన విషయం అని చెప్పారు. ఈ డబ్బుల కలెక్షన్లో కూడా టిడిపి నాయకుల్లో మూడు గ్రూపులు ఒక గ్రూపుని మించి ఇంకొక గ్రూపు దాదాగిరి చేసి డబ్బులు వసూలు చేశారు ఇంత దారుణమైన పరిస్థితులు కోటకొండలో ఎప్పుడు నెలకొనలేదు అని చెప్పారు. మా వైసిపి హయాంలో పంచాయతీ వాళ్లకు కూడా మీరు ఎక్కడ ఎవరి వద్ద డబ్బులు వసూలు చేయొద్దని క్లియర్ గా ఇన్స్ట్రక్షన్స్ ఇచ్చి ఎవరి దగ్గర డబ్బులు కలెక్ట్ చేయకుండా చూశామన్నారు.

కానీ ఈ కూటమి ప్రభుత్వ హయాంలో చిరు వ్యాపారస్తుల ను కూడా వదిలిపెట్టకుండా డబ్బులు వసూలు చేశారు, ఇంతకంటే దారుణమైన విషయం ఇంకొకటిలేదన్నారు.

కోటప్పకొండ తిరుణాళ్లలో మద్యం ఏరులై పారింది, చివరకు హోంగార్డు కూడా మద్యం అమ్మటం, వీడియోలు ద్వారా పట్టు పడటం చూస్తుంటే, ఎంత ధైర్యం ఉంటే తిరణాళ్లలో ఓపెన్ గా స్టాల్స్ పెట్టి మరి మద్యం అమ్ముతారు,

దీన్ని బట్టి ఈ ప్రభుత్వ పనితీరు ప్రజలు అర్థం చేసుకుంటున్నారు. సి.ఎమ్ కోటప్పకొండ వంటి పవిత్ర పుణ్య స్థలంలో కూడా మద్యం అమ్మండి, మాకు రాబడే ముఖ్యం, ఎక్కడ ఏమిటి అనేది చూసుకోవద్దు అన్నట్టుగా

దేవాలయాల వద్ద కూడా ప్రభుత్వం చేస్తున్న మద్యం అమ్మకాలు చూస్తుంటే ప్రజలు అసహ్యించుకుంటున్నారు అని హితవుపలికారు. ఎస్పీ ఈ మద్యం అమ్మకాల వెనక హోంగార్డే కాకుండా ఎవరెవరున్నారో విచారణ చేసి వారి మీద చర్యలు తీసుకోవాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నాం అని చెప్పారు. అదేవిధంగా రొంపిచర్ల మండలం విప్పర్ల గ్రామంలో పోలీసులు అంతా తిరుణాల కార్యక్రమంలో ఉంటే విప్పర్ల గ్రామంలో మటుకు క్యాసినో పెట్టి, కాసినో ఎలా ఉంటుందో ఈ గ్రామాల్లో కూడా ప్రజలకు చూపిస్తున్నారు ఇంత దారుణం ఇంకెక్కడయినా వుందా అన్నారు.

కోటప్పకొండ తిరుణాలలో అడుగడుగునా ట్రాఫిక్ జామ్, మూడు రోజుల ముందే బస్టాండ్ ఏర్పాటు, బస్టాండ్ స్థలం కరెక్ట్ కాదు, లింక్ రోడ్లు బాగు చేయమని చెప్పాము, కానీ ఎవరు సూచనలు ఇచ్చినా అధికారులు గాని, ప్రజా ప్రతినిధి గాని పట్టించుకునే పాపానపోలేదన్నారు. ఈ ప్రభుత్వం ఏర్పాడి రెండు సంవత్సరాల అయినప్పటికీ ఇప్పటివరకు కోటప్పకొండ దేవస్థానానికి కమిటీ ఎందుకు ఏర్పాటు చేయలేకపోయారు. పాతూరు శివాలయం ఇసపాలెం వంటి చిన్న చిన్న దేవాలయాలకు కూడా కమిటీలు వేసిన మీరు కోటప్పకొండకు కమిటీ ఎందుకు వేయలేదు అని సూటిగా ప్రశ్నించారు. కమిటీ ఏర్పడి ఉంటే వారు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసే అవకాశం ఉంటుందని చెప్పారు. మీకు పరిపాలన చేతకాదని ఎమ్మెల్యే ను తీవ్రంగా విమర్శించారు. ఈ సంవత్సరం తిరణాళ్ల సందర్భంగా దేవాలయానికి కోటి 90 లక్షల నిధులు వచ్చాయి సంతోషమే, గత సంవత్సరం కూడా కోటి 75 లక్షలు వచ్చాయి. ఈ సంవత్సరం కోటి 90 లక్షల నిధులు వచ్చినాయి అయితే ఈ డబ్బును మీరు కోటప్పకొండ అభివృద్ధికి ఖర్చు చేస్తున్నారా, కోటప్పకొండలో గత రెండు సంవత్సరాల నుంచి ఒక బాత్రూమ్లు నిర్మించడం తప్ప ఒక అభివృద్ధి కార్యక్రమం కూడా చేసిన పాపాన పోలేదని, ఈ వచ్చిన డబ్బంతా ఏం చేస్తున్నారని ప్రశ్నించారు.



అదేవిధంగా కోటప్పకొండ దేవాలయాల ఈఓ కాంట్రాక్టర్ అవతారం ఎత్తి లక్షల రూపాయలు చేతులు మారుస్తున్నాడని, దీంట్లో ఎమ్మెల్యే కి కూడా వాటాలు ఇస్తూ కాంట్రాక్టులన్ని తనే చేస్తున్నాడని విమర్శించారు. కోటప్పకొండ దేవాలయ ఉద్యోగస్తులకు ఇవ్వటానికి జీతాలకు కూడా డబ్బులు లేకుండా చేశారని, కోటప్పకొండ లో రెండు కోట్ల రూపాయల ఫిక్స్ డిపాజిట్ లను జీతాల కోసం మార్చడం జరిగిందన్నారు. గత 30 సంవత్సరాలుగా ఇటువంటి పరిస్థితి ఎప్పుడు జరగలేదని, కోటప్పకొండ నిధులు అన్నిటిని ఖాళీ చేశారని, ఈ ఆదాయంపై ఖచ్చితంగా ఆడిట్ జరగాలని ఈ సందర్భంగా అయన డిమాండ్ చేశారు. భక్తులందరికీ లడ్డూ ప్రసాదం ఇస్తామని లక్ష 25 వేల లడ్లు తయారు చేశారు, కానీ కేవలం 30 వేల మందికి మాత్రమే లడ్లు ఇచ్చారని ఈ మిగిలిన లడ్డులు కూడా పక్కదారి పట్టించే కార్యక్రమం చేశారని ఇది చాలా దారుణమైన విషయం, అని అదేవిధంగా ప్రకాశం జిల్లాకు చెందిన ఒక యువకుడు కాలువలో కొట్టుకుపోయినా ప్రభుత్వ యంత్రాంగం స్పందించలేదని డిజాస్టర్ మేనేజ్మెంట్ ఫైర్ డిపార్ట్మెంట్ (ఎండీఫ్) దళాలు ఏం చేస్తున్నాయని, ఒక మనిషి కాలువలో పడి కొట్టుకుపోతున్న మీరందరూ ఏం చేస్తున్నారని ఇంతకంటే ఘోరమైన సంఘటన లేదని గత 30 సంవత్సరాలు ఇటువంటి ఘోరమైన సంఘటనలు కోటప్పకొండలో ఎప్పుడు జరగలేదని,

కోటప్పకొండ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఏకైక ప్రభ గోనపూడి గ్రామానికి సంబంధించినదని, ఆ ప్రభ దగ్గర ప్రజలు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభిమానులు ఎవరు ఉండకూడదని ఉద్దేశంతో రూరల్ ఎస్పై అక్కడ లాఠీచార్జి జరిపారని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభలు కోటప్పకొండ తిరుణాళ్లకు రాకూడదా, ఇదెక్కడి అన్యాయమని, ఈ లాఠీచార్జికి రూరల్ ఎస్పై ఖచ్చితంగా బాధ్యత వహించాలని, ఇతన్ని భవిష్యత్తులో మేము అధికారంలో వచ్చిన తర్వాత ఎట్టి పరిస్థితులను వదిలిపెట్టే పరిస్థితి ఉండదని, ఎవరైతే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభలను కోటప్పకొండ క్షేత్రానికి రాకుండా అడ్డుకున్నారో ఆ గ్రామాల ప్రజలకు కూడా భవిష్యత్తులో ఇదే విధమైనటువంటి చర్యలు జరుగుతాయన్నారు. అప్పుడు మీరు బాధపడినా ప్రయోజనం లేదని హెచ్చరించారు. ఇది మంచి పద్ధతి కాదు ఇప్పటికైనా రూరల్ ఎస్పై పద్ధతి మార్చుకోండి, తిరుణాలకు విరుద్ధంగా సాంప్రదాయాల విరుద్ధంగా చేసిన ఈ కార్యక్రమాల మీద ఖచ్చితంగా డిజిటల్ బుక్ లో మీ పేరు నమోదు చేస్తాం, తప్పనిసరిగా చర్యలు తీసుకుంటాం,

తిరుణాళ్ల నిర్వహణలో ఈ ప్రభుత్వం యంత్రాంగం పూర్తిగా ఘోరంగా విఫలమైందన్నారు. కొత్తగా వచ్చిన అధికారులకు డైరెక్షన్ ఇచ్చే ప్రజాప్రతినిధి, చీపురు పట్టుకొని వూడిస్తే తిరునాళ్ల అయిపోతుంది అనుకుంటున్నాడు తప్ప అధికారులకు ఎటువంటి డైరెక్షన్ ఇచ్చిన పాపాన పోలేదు ఇది మేము తిరునాళ్ళ ముందు కూడా చెప్పాము తిరుణాళ్ల ఏర్పాట్లలో ప్రజా ప్రతినిధి పూర్తిగా వైఫల్యం చెందాడు. అధికారులకి ప్రజాప్రతినిధులకు ఎక్కడ అవగాహన లేదు, కోఆర్డినేషన్ లేదు, వీరి వైఖరి వల్ల భక్తులు తీవ్రమైన ఇబ్బందులకు గురి అయ్యారు. అదేవిధంగా కోటప్పకొండ తిరుణాళ్లలో మందు అమ్ముకునే కార్యక్రమం, అక్కడి స్థలాలు వారి అనుచరులకు దోచిపెట్టడం, తిరణాలకు వచ్చిన చిన్న చిన్న వ్యాపారుల వద్ద అధికార పార్టీ నేతలు మామూలు వసూలు చేయడం, తిరణాళ్లలో పోలీసు అధికారులు బిజీగా ఉంటే విప్పర్ల గ్రామంలో క్యాసినో నడపటం, ఆ క్యాసినో మీద ఐదు, ఆరు కోట్లు అధికార పార్టీ వాళ్లు దోచుకునే కార్యక్రమం చేశారు, ఇంతకంటే దారుణం ఇంకెక్కడ ఉండదని, ఎమ్మెల్యేకు ఎక్కడ పడితే అక్కడ సంపాదన కావాలని, సంపాదన లేకపోతే నేను బతకలేను అనే స్థాయికి వచ్చాడని, కోటప్పకొండ తిరుణాళ్ల కూడా అవినీతిమయంతో, అక్రమాలతో, దందాలతో నడిచింది అనేది వాస్తవం అని ఈ వైఫల్యాలకు ప్రజాప్రతినిధులు, అధికారులు పూర్తిగా బాధ్యత వహించాలని ఈ సందర్భంగా తెలియజేశారు

# బాపట్ల జిల్లా రైతాంగానికి ఊరట

పెన్ పవర్ బ్యూరో బాపట్ల ఫిబ్రవరి 18:

(రైతు ప్రభుత్వమని మరోసారి నిరూపితమైంది

(శనగలకు క్వింటాకు రూ.5,875 కనీస మద్దతు ధర

(శనగలు మార్క్ఫెడ్ ద్వారా కొనుగోలుకు ప్రభుత్వ ఆదేశం

(రైతు సేవా కేంద్రాల ద్వారా త్వరలో కొనుగోలు

(సీఎం చంద్రబాబు వ్యవసాయ మంత్రి అచ్చెన్న కు ధన్యవాదాలు తెలిపిన ఎమ్మెల్యే ఏలూరి

(బర్లీ పొగాకు కు ప్రత్యామ్నాయంగా అత్యధికంగా శనగల సాగు(గతంలో బర్లీ పొగాకు రైతులను ఆదుకున్న ప్రభుత్వం

బర్లీ పొగాకుకు ప్రత్యామ్నాయంగా శనగల సాగు చేసిన బాపట్ల జిల్లా రైతాంగానికి రాష్ట్ర ప్రభుత్వం ఊరట కల్పించింది. మార్కెట్లో ధరలు పడిపోవడంతో ఆందోళన చెందిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం కనీస మద్దతు ధర (మీస్రా)తో కొనుగోలు చేయాలని నిర్ణయించింది. క్వింటాకు రూ.5,875 ధరను నిర్ణయిస్తూ మార్క్ఫెడ్ ఆధ్వర్యంలో రైతు సేవా కేంద్రాల ద్వారా శనగలు కొనుగోలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది.

సీఎం దృష్టికి సమస్యను తీసుకెళ్లిన ఎమ్మెల్యే ఏలూరి

నల్లబర్లీ పొగాకు నిషేధం నేపథ్యంలో అత్యధికంగా రైతులు శనగ సాగు చేశారని, దిగుబడుల సమయంలో ధరలు పడిపోతుండటంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, వ్యవసాయ శాఖ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకెళ్లారు. రైతుల పరిస్థితిని వివరించి తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన ప్రభుత్వం వెంటనే కొనుగోలు నిర్ణయం తీసుకోవడం విశేషం.

రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు

ప్రభుత్వ నిర్ణయం మేరకు త్వరలోనే రైతు సేవా కేంద్రాల ద్వారా శనగల కొనుగోలు ప్రక్రియ ప్రారంభం కానుంది. మార్క్ఫెడ్ ఆధ్వర్యంలో పారదర్శకంగా కొనుగోళ్లు నిర్వహించి రైతులకు నేరుగా చెల్లింపులు జరపనున్నారు. దీంతో మధ్యవర్తుల ఆధారాన్ని తగ్గించి రైతులకు న్యాయమైన ధర లభించనుంది.



పొగాకు రైతులకు ఆదరణ అదే దిశలో శనగ రైతులకు మద్దతు

గతంలో పొగాకు రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్న సమయంలో కూడా ప్రభుత్వం ఆదుకున్న సంగతి తెలిసిందే. అదే విధంగా ఇప్పుడు బర్లీ పొగాకుకు ప్రత్యామ్నాయంగా శనగలు సాగు చేసిన రైతులకు కూడా భరోసా కల్పించడం ద్వారా ప్రభుత్వం రైతు పక్షపాతి అనే విషయాన్ని మరోసారి నిరూపించుకుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

ధన్యవాదాలు తెలిపిన ఎమ్మెల్యే ఏలూరి

ప్రభుత్వ నిర్ణయంపై ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు రైతాంగం తరఫున ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, వ్యవసాయ శాఖ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రైతుల శ్రమకు తగిన గౌరవం లభించేలా ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం రైతులకు ఎంతో ఉపశమనాన్ని కలిగిస్తుందని పేర్కొన్నారు. గతంలోనూ నల్ల బర్లీ పొగాకు రైతులను ఆదుకొని ప్రభుత్వం అండగా నిలిచిందని సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి గుర్తు చేశారు.

రైతులకు భరోసా ధర స్థిరీకరణే లక్ష్యం


మార్కెట్లో ధరల హెచ్చుతగ్గుల వల్ల రైతులు నష్టపోకుండా ఉండేలా ధర స్థిరీకరణ చర్యలు చేపట్టడం ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ఏలూరి పేర్కొన్నాయి. శనగల కొనుగోలు నిర్ణయం అమలులోకి రావడంతో బాపట్ల జిల్లా రైతాంగంలో హర్షం వ్యక్తమవుతోంది.

# పార్లమెంట్ అనుబంధ సంఘాలపై టీడీపీ కసరత్తు

**-కేంద్ర కార్యాలయంలో ఎమ్మెల్యేల భేటీ -ఫోన్లో మంత్రులతో మాట్లాడిన ఎమ్మెల్యేలు**

**-సామాజిక న్యాయం పాటిస్తూ అన్ని వర్గాలకు ప్రాధాన్యం**

పెన్ పవర్ బ్యూరో బాపట్ల ఫిబ్రవరి 18:



పార్లమెంట్ అనుబంధ సంఘాల నియామకాలపై తెలుగుదేశం పార్టీ కసరత్తు ప్రారంభించింది. బుధవారం మంగళగిరిలోని కేంద్ర టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్సీ చిరంజీవి,ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివరావు, నక్క ఆనంద్ బాబు , బిఎన్ విజయ్ కుమార్ , నరేంద్ర వర్మ , ఎం ఎం కొండయ్య, బాపట్ల పార్లమెంట్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సలగల రాజశేఖర్ బాబు, నక్కల రాఘవ లు సమావేశమై విస్తృతంగా చర్చించారు. అలాగే మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవి కుమారులతో ఫోన్లో మాట్లాడారు. సామాజిక న్యాయం పాటిస్తూ అన్ని వర్గాలకు సముచిత ప్రాధాన్యం కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. అనుభవం, సామర్థ్యం, ప్రాంతీయ సమతుల్యతతో పాటు సామాజిక సమీకరణను పరిగణనలోకి తీసుకోవాలని వారు అభిప్రాయపడ్డారు.పార్టీ వ్యవస్థాపక సిద్ధాంతాలకు అనుగుణంగా సామాజిక న్యాయం పాటిస్తూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలతో పాటు మహిళలకు కూడా తగిన ప్రాధాన్యం కల్పించాలనే అంశంపై ఏకాభిప్రాయం వ్యక్తమైంది. ఈనెల 22 న తుది జాబితాపై అందించేలా చర్యలు తీసుకోవాలని జోన్ ఇంచార్జ్ ఎమ్మెల్సీ చిరంజీవి పేర్కొన్నారు.

# ఫిబ్రవరి 22 ఆదివారం బాపట్ల పార్లమెంట్ నూతన కార్యాలయానికి ఘనంగా శంకుస్థాపన

**- ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు మరియు బావుడా ఛైర్మన్ సలగల రాజశేఖర్ బాబు వెల్లడి.**

పెన్ పవర్ బ్యూరో బాపట్ల ఫిబ్రవరి 18

బాపట్ల పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు మరియు బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు, బావుడా ఛైర్మన్ సలగల రాజశేఖర్ బాబు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పార్టీ భవిష్యత్తు ప్రణాళికలు మరియు నూతన కార్యాలయ నిర్మాణ వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు మాట్లాడుతూ.. బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పార్టీ కార్యకలాపాలను మరింత బలోపేతం చేసేందుకు, కార్యకర్తలకు నిత్యం అందుబాటులో ఉండేలా ఒక అత్యాధునిక నూతన కార్యాలయాన్ని నిర్మించ తలపెట్టినట్లు తెలిపారు. ఈ నెల అనగా ఫిబ్రవరి 22వ తేదీన బాపట్ల నియోజకవర్గం వెదుళ్ళపల్లి భదిరుల ఆశ్రమ పాఠశాల ప్రక్కన బాపట్ల పార్లమెంట్ నూతన కార్యాలయానికి అత్యంత వైభవంగా శంకుస్థాపన చేయబోతున్నామని ఆయన అధికారికంగా ప్రకటించారు. ఈ శంకుస్థాపన కార్యక్రమంలో భూమి పూజ చేయడానికి బాపట్ల జిల్లా ఇన్ ఛార్జ్ మంత్రివర్యులు, గృహ నిర్మాణ శాఖ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రివర్యులు కొలుసు పార్థసారథి గారు,రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రివర్యులు అనగాని సత్యప్రసాద్ ,రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రివర్యులు గొట్టిపాటి రవి కుమార్ ,పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ,వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద్ బాబు ,చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాల కొండయ్య ,సంతనూతలపాడు ఎమ్మెల్యే బి.యన్.విజయ్ కుమార్ ముఖ్య అతిథులుగా విచ్చేయనున్నారని,అదే రోజు బాపట్ల పార్లమెంట్ కమిటీల ప్రమాణ స్వీకారం కార్యక్రమం కూడా జరుగుతుందని బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు తెలిపారు.ఈ శంకుస్థాపన మహోత్సవాన్ని పురస్కరించుకుని నియోజకవర్గంలోని ప్రతి కార్యకర్త, నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు మరియు బావుడా చైర్మన్ సలగల రాజశేఖర్ బాబు పిలుపునిచ్చారు.



